సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం । 16 । జూన్ । 2023



అన్నదాతలూ.. అప్రమత్తం
అన్నదాతలు కోటి ఆశలతో వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో నకిలీ విత్తనాల బెడద వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. - 8లో▸



రాష్ట్రంలో ప్రగతి పరుగులు
బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రగతి పరుగులు తీస్తోందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
43.8⁰ /31.1⁰

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచే వేడి గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నీట్‌లో గిరిజన కళాశాల విద్యార్థుల ప్రతిభ
హన్మకొండ చౌరస్తా: నీట్ పరీక్షలో హనుమకొండ పెద్దమ్మగడ్డ సమీపంలోని తెలంగాణ గిరిజన ప్రతిభా కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ నందమూరి పద్మిని తెలిపారు. కళాశాల విద్యార్థులు మూడావత్ కావ్యాంజలి 467, మాలావత్ స్వాతిప్రియ 394, కొర్ర రేఖ 371, తేజావత్ నవ్యతేజ 367, నేనావత్ శారద 363వ ర్యాంకులు సాధించి ఎంబీబీఎస్ సీట్లు పొందడానికి అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాల అధ్యాపక బృందం గురువారం అభినందనలు తెలిపింది.

డిగ్రీ పరీక్షల్లో 55 మంది డీబార్
కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో 55 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 8 మంది, విజ్ఞాన భారతి కళాశాలలో ఒకరు, నలంద కళాశాలలో ముగ్గురు, నర్సంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, భద్రాచలం ప్రభుత్వ కళాశాలలో ఇద్దరు, ఉట్నూరులోని ఏఆర్‌ఎస్ కళాశాలలో 21 మంది, పుల్లాజీ బాబా కళాశాలలో 12 మంది, ఉట్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఆరుగురు విద్యార్థులు.. మొత్తం 55 మంది డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

బస్‌పాస్‌లకు దరఖాస్తు చేసుకోవాలి
హన్మకొండ: విద్యార్థులు బస్‌పాస్ కోసం దరఖాస్తు చేసుకోవాలని టీఎస్ ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 ఏళ్లలోపు బాలురకు, 18 ఏళ్లలోపు బాలికలకు పదోతరగతి వరకు ఉచిత బస్ పాస్‌లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. www.online.tsrtcpass.in లో దరఖాస్తు చేసుకుని బస్టాండ్‌లో సంప్రదించాలని సూచించారు. కళాశాల విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న రిజర్వేషన్ ఐడీపై ప్రిన్సిపాల్ సంతకంతో పాటు స్టాంపు వేయించుకుని, పదోతరగతి సర్టిఫికెట్ జిరాక్స్ ప్రతిని జతపరిచి బస్‌పాస్ కౌంటర్‌లో అందించి పాస్ తీసుకోవాలని కోరారు.

రికార్డు షీట్, టీసీ బుక్‌లనే వినియోగించాలి
డీఈఓ ఎండీ అబ్దుల్‌హై

విద్యారణ్యపురి: జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమిక పాఠశాలలు ఇక నుంచి డీఈఓ కార్యాలయం జారీ చేసే రికార్డు షీట్, టీసీ బుక్‌లనే వినియోగించాలని డీఈఓ ఎండీ అబ్దుల్‌హై గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12నుంచి డీఈఓ కార్యాలయంలోని జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు (డీసీఈబీ) బ్యాంక్ చలానా ద్వారా రూ.250 చెల్లించి స్వయంగా డీఈఓ కార్యాలయం నుంచి పొందాలని యాజమాన్యాలకు సూచించారు. గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలు సంబంధిత మండల విద్యాశాఖ అధికారి ధ్రువీకరణతోపాటు పాఠశాల గుర్తింపు పత్రాన్ని జతపర్చాలని ఆయన కోరారు.

అమ్మవారిని దర్శించుకున్న డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్



హన్మకొండ కల్చరల్: భద్రకాళి అమ్మవారిని గురువారం తెలంగాణ స్టేట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ వైజయంతి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారిని ఆలయ ఈఓ శేషుభారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతించారు. ముందుగా ఆది శంకరులు, వల్లభ గణపతిని దర్శించుకుని అమ్మవారికి పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ స్నపన మందిరంలో అర్చకులు మహాదాశీర్వచనం అందించారు. కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్కూళ్లు
కాకోజీ సెంటర్: జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఏబీవీఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం డీఈఓ డి.వాసంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీఎస్‌ఎఫ్ నాయకులు మురళి, ప్రశాంత్, కిశోర్ పాల్గొన్నారు.

దబ్బాలు, షెడ్లు, తోపుడు బండ్లను తొలగిస్తున్న బల్దియా సిబ్బంది







ఫుట్‌పాత్ నుంచి రోడ్డుపైకి!

చిరువ్యాపారులపై అధికారుల ప్రతాపం
- ఫుట్‌పాత్‌పై డబ్బాల తొలగింపు
- పొట్టకొట్టొద్దంటూ ఆవేదన

వరంగల్ అర్బన్: చిన్నాచితక వ్యాపారం చేస్తూ కుటుంబాల్ని పోషించుకునే చిరువ్యాపారులపై బల్దియా అధికారులు ప్రతాపం చూపించారు. వరంగల్ కేఎంసీ నుంచి ఎంజీఎం జంక్షన్ వరకు ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న షెడ్లను, తోపుడు బండ్లను గురువారం బల్దియా టౌన్ ప్లానింగ్ సిబ్బంది, చైన్‌మెన్లు, డీఆర్‌ఎఫ్ బృందాలు జేసీబీ సహకారంతో నేల మట్టం చేశారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారాలు చేస్తున్న తమ పొట్ట కొట్టొద్దని, తమ కుటుంబాలను రోడ్డు పాలు చేయొద్దని అడ్డగించి చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. జేసీబీ సహకారంతో బలవంతంగా సిబ్బంది తమ పని పూర్తి చేశారు. డబ్బాలను చిరువ్యాపారులు వాహనాల్లో తరలించగా.. షెడ్లు, తోపుడు బండ్లను బల్దియా వాహనాల్లో ప్రధాన కార్యాలయం ఆవరణలోని ఇండోర్ స్టేడియానికి సమీపంలో డంప్ చేశారు. ఏసీపీ శ్రీనివాస్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు అనిల్‌కుమార్, వెంకటరమణ, రోజారెడ్డి తదితరులు ఇందులో ఉన్నారు. రాష్ట్ర మంత్రి కేటీఆర్ రాక సందర్భంగా తమను రోడ్డు మీద పడేయడం సరికాదని చిరువ్యాపారులు నిరసన వ్యక్తం చేశారు. కాగా.. పోలీస్ కమిషనర్, బల్దియా సిటీ ప్లానర్ ఆదేశాల మేరకు, నగర సుందరీకరణలో భాగంగా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించినట్లు బల్దియా అధికారులు తెలిపారు.



యునానీ.. దీనావస్థ
వరంగల్ నగరంలోని ఎంజీఎం ఆస్పత్రి పరిధిలో ఉన్న యునాని ఆస్పత్రి పరిస్థితి దయనీయంగా తయారైంది. ఆస్పత్రి పై రేకులు పగిలిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. వర్షాకాలం వస్తున్నందున తమ పరిస్థితి ఏంటని వైద్యులు, సిబ్బంది వాపోతున్నారు.

\- ఎంజీఎం

పోతేపోనీ.. మాకేంటి?

వ్యాపార, వాణిజ్య గ్లో సైన్ బోర్డుల ఆదాయం గోవిందా
- ఏటా గ్రేటర్ వరంగల్‌కు రూ.50 లక్షలు గండి
- పన్ను వసూళ్లు మరిచిన టౌన్‌ప్లానింగ్ అధికారులు
- పట్టించుకోని పాలక, అధికార వర్గాలు



వరంగల్ జేపీఎన్ రోడ్డులో వ్యాపార దుకాణాల ఎదుట నేమ్ బోర్డులు

వరంగల్ అర్బన్: 'జీతం మా హక్కు.. లంచం అదనపు భత్యం. విధులు సాధారణం. మేం ఇంతే.. మారేది లేదు' అన్నట్లుగా ఉంది.. గ్రేటర్ వరంగల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తీరు. పోతే పోనీ మాకేంటి? ప్రజాధనమేగా అన్నట్లు వారు వ్యవహరిస్తున్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ)కి వివిధ పద్దుల కింద వచ్చే ఆదాయంలో ప్రకటనల పన్ను ఒకటి. కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయి ఉద్యోగులు దీనికి తూట్లు పొడుస్తున్నారు. గ్రేటర్ ఆదాయంకంటే తమ సొంతానికి జేబుల్లో వేసుకోవడమే లక్ష్యంగా వీరు వ్యవహరిస్తున్నారు.

విచ్చలవిడిగా వెలుస్తున్న బోర్డులు!

రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత రెండో అతి పెద్ద నగరం వరంగల్. వాణిజ్య పరంగా అభివృద్ధి బాట పడుతోంది. రహదారుల్లో రంగుల ప్రచార బోర్డులు జోరుగా దర్శనమిస్తున్నాయి. వాణిజ్య హోర్డింగ్‌లు, వ్యాపార, వాణిజ్య వర్గాల దుకాణాలు (గ్లోసైన్ బోర్డులు) ముందు పెట్టుకున్న బోర్డుల నుంచి ప్రకటనలు భారీగా వెలుస్తున్నాయి. ఇందుకుగాను జీడబ్ల్యూఎంసీకి అడ్వర్టైజ్‌మెంట్ సంస్థలు, వ్యాపార నిర్వాహకులు పన్నులు చెల్లించాలి. దుకాణాల నేమ్ బోర్డ్ స్క్వేర్‌మీటర్ ఆధారంగా లెక్కించి నిర్దేశించిన సొమ్మును ఏడాదికోసారి చెల్లించాల్సి ఉంటుంది. గ్రేటర్‌కు ప్రతీ ఏడాది రూ. 1.50 కోట్ల ఆదాయం సమాకురుతోంది. ఈఏడాది గ్రేటర్ కౌన్సిల్ ప్రకటనల పన్నుల పెంపుతో ఆదాయం రూ. 3 కోట్ల వరకు సమకూరుతోంది.

వ్యాపార సంస్థలపై వల్లమాలిన ప్రేమ

నగరంలోని వ్యాపార, వాణిజ్య వర్గాల దుకాణాల ఎదుట పెట్టుకున్న బోర్డుల నుంచి ప్రకటనల పన్నులను వసూలు చేసేందుకు టెండర్ నిర్వహించి, ప్రయివేట్ సంస్థకు అప్పగించేవారు. 2012-13 వరకు ఏటా పన్నుల రూపంలో రూ.50 లక్షల వరకు ఆదాయం వచ్చేది. 2013-14 నుంచి టెండర్లు పిలవకుండా టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది వసూలు చేస్తున్నారు. 2013-14 గ్లో సైన్ బోర్డుల ద్వారా ఆదాయం రూ.13.30 లక్షలు వసూలు చేశారు. 2014-15లో రూ. 52.39 లక్షలు, 2015-16లో రూ.9.54 లక్షలు, 2016-7లో రూ.4.57 లక్షలు వసూలు చేశారు. పేద, మధ్య తరగతి వారు ఆస్తి పన్ను చెల్లించకపోతే నానా యాగీ చేసే గ్రేటర్ అధికార యంత్రాంగం వ్యాపార నిర్వాహకుల నుంచి గ్లో సైన్ బోర్డుల ప్రకటనల పన్నులు వసూలు చేయడంపై పెద్దగా దృష్టి సారించట్లేదు. దీంతో గత ఆరేళ్లుగా ఏడాదికి రూ.50 లక్షల చొప్పున వసూలు చేయాల్సిన గ్లోసైన్ బోర్డుల ఆదాయం గ్రేటర్ వరంగల్‌కు రాకుండా చేజారిపోతోంది.

ఎక్కడికక్కడే వసూళ్లు

దుకాణాల ఎదుట పెద్దగా పెట్టుకున్న ప్రకటనల బోర్డులకు పన్నులను వసూలు చేసేందుకు గ్రేటర్ టౌన్ ప్లానింగ్‌లో ప్రత్యేకంగా విభాగం లేదు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, చైన్‌మెన్లకు వసూళ్ల బాధ్యతలను కట్టబెట్టారు. సర్కిళ్ల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకొని వసూలు చేయాలి. కానీ వ్యాపార, వాణిజ్య దుకాణాల వద్దకు ప్రకటనల పన్నుల కోసం వెళ్తున్న క్షేత్రస్థాయిలోని ఉద్యోగులు బేరసారాలకు దిగి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈవిషయం టౌన్‌ప్లానింగ్ అధికారులకు తెలిసినా.. పట్టించుకోనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పాత బకాయిలతోపాటు కొత్త పన్నులపై దృష్టి సారించాల్సిన అవసరముంది. గ్రేటర్ టౌన్ ప్లానింగ్ అధికార యంత్రాంగం ఆదాయం సీరియస్‌గా తీసుకోవాలి. మేయర్, కమిషనర్లు అందుకోసం ప్రత్యేకంగా చొరవ చూపించాలి.

వచ్చే 'దశాబ్ది'కి ప్రణాళిక రూపొందిస్తాం
- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్
- మడిపల్లిలో పల్లెప్రగతి దినోత్సవం



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హసన్‌పర్తి: ఈ దశాబ్ది ఉత్సవాల అనుభవాలతో పదేళ్ల కాలానికి సంబంధించిన ప్రణాళిక రూపొందిస్తామని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం హసన్‌పర్తి మండలం మడిపల్లి గ్రామంలో పల్లెప్రగతి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పల్లె ప్రగతి ద్వారానే గ్రామాలు అభివృద్ధిలో ముందుకు సాగుతున్నాయని వివరించారు. మడిపల్లిలోని క్రీడాప్రాంగణంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈసందర్భంగా గ్రామ జనాభా, గ్రామంలో హరితహారం పురస్కరించుకుని ఎన్ని మొక్కలు నాటారు? నర్సరీలో ఎన్ని మొక్కలు పెంచుతున్నారనే వివరాలు తెలుసుకున్నారు. డీఆర్డీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి యూనిఫాంలు అందించారు. కార్యక్రమంలో కలెక్టర్‌ను సన్మానించారు. స్థానిక సర్పంచ్ చిర్ర సుమలత అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో జెడ్పీటీసీ రేణుకుంట్ల సునిత, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, రైతు బంధు సమితి మండల కో-ఆర్డినేటర్ అంచూరి విజయ్, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు ఇంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పేరిట ఆస్తులు మార్చొద్దు
- పోలీస్ కమిషనర్ రంగనాథ్
- ఘనంగా ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం



మాట్లాడుతున్న సీపీ రంగనాథ్

హసన్‌పర్తి: తమ పేరిట ఉన్న ఆస్తులను పిల్లల పేరిట మార్చొద్దని పోలీస్ కమిషనర్ రంగనాథ్ వృద్ధులకు సూచించారు. నగరంలోని గోపాలపురంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీ రంగనాథ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు బతికున్నంత కాలం ఆస్తుల్ని కాపాడుకోవాలన్నారు. బాధ్యత తీరిపోయిందని, పిల్లల పేరిట ఆస్తులు మార్పిడి చేస్తే ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. వృద్ధులకు ఏ చట్టపరమైన సమస్య ఉన్నా.. పోలీస్‌శాఖ సహకరిస్తుందన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దామెర నర్సయ్య అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నర్సయ్య, కార్యదర్శి తేరాల యుగంధర్, జిల్లా సంక్షేమశాఖ అధికారి మధురిమ, సీడబ్ల్యూసీ జిల్లా కమిటీ సభ్యుడు కజాంపురం దామోదర్, స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మణీందర్‌నాథ్, లయన్స్ క్లబ్ రీజినల్ మేనేజర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు ప్రారంభించాలి
పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్



మాట్లాడుతున్న సీపీ రంగనాథ్, పక్కన హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య తదితరులు

హన్మకొండ అర్బన్: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు సత్వరమే ప్రారంభించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్.. జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్యతో కలిసి సీపీ రంగనాథ్ ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ రెండు జిల్లాల్లో 100 శాతం ఓటింగ్ జరిగేలా సమష్టిగా పనిచేయాలన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించడంలో జిల్లా పోలీస్, రెవెన్యూ అధికారులదే కీలకపాత్ర అన్నారు. జిల్లాలో గత అనుభవాలు దృష్టిలో ఉంచుకుని ఓటింగ్ తక్కువ జరిగిన ప్రాంతాల్లో ఓటు హక్కు ప్రాముఖ్యత కార్యక్రమాలను వినూత్నంగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు సకాలంలో తిప్పికొట్టే విధంగా ప్రత్యేక బృందాలను నియమించాలన్నారు. ఎన్నికల్లో వివిధ ఫిర్యాదులను స్వీకరించడానికి టోల్ ఫ్రీ నంబర్ 1950ని కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో రెండు జిల్లాల అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, అశ్విని తానాజీ, డీఆర్‌ఓ వాసుచంద్ర, పరకాల ఆర్డీఓ రాము, తహసీల్దార్లు రాజ్‌కుమార్, కిరణ్‌కుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్ల పరిశీలన

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని ఈవీఎంల గోదాంను గురువారం అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట సందర్శించారు. ఈవీఎంలు, వీవీప్యాట్లను పరిశీలించారు.

నాయకుల నియామకం

ఈవీఎం, వీవీప్యాట్‌ల పరిశీలనకు కాంగ్రెస్ వరంగల్ జిల్లా కమిటీ నుంచి నాయకుల పేర్లను పంపిస్తూ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ కలెక్టర్‌కు లేఖ రాశారు. ఈనెల 12 నుంచి 23 వరకు జరిగే ఈ పరిశీలనకు జిల్లా కమిటీ నుంచి ఈవీ.శ్రీనివాసరావు, దాసి రాందేవ్, దాసరి రాజేశ్, నారగోని మురళి, అల్లాడి రాము, చిలువేరు రమేశ్, ఎర్రా ప్రకాశ్, కర్ర శ్రీనివాస్‌రెడ్డిని అనుమతించాలని సూచించారు.

మంత్రి కేటీఆర్ పర్యటన ఏర్పాట్లపై సమీక్ష
కరీమాబాద్: రాష్ట్ర మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు పక్కాగా ఉండాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం మంత్రి పర్యటనపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. మంత్రి ప్రారంభించే ప్రతీ కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు ఇన్‌చార్జిలను ఏర్పాటు చేయాలని చెప్పారు. డయాస్ మీద ప్రొటోకాల్ ప్రకారం సీట్లు కేటాయించాలని సూచించారు. ఇన్నర్ రింగ్ రోడ్డుకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన మ్యాప్ పెట్టాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీసీపీ కరుణాకర్, ఆర్డీఓ మహేందర్ జీతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం
న్యూశాయంపేట: వరంగల్ జిల్లాలోని పలు మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కె.విక్రమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20లోగా దరఖాస్తులు చేసుకోవాలని, వివరాలకు హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఓటు నమోదును వినియోగించుకోండి
- బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా
- బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు సూచనలు



మాట్లాడుతున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంల్ అర్బన్: 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో బీఎల్ఓలు, సూపర్‌వైజర్లతో ఓటరు నమోదు, సంబంధిత అంశాలపై సమావేశం నిర్వహించారు. ఇందులో కమిషనర్ మాట్లాడుతూ.. బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్‌లు, ఓటు నమోదుకు పౌరులను ప్రోత్సహించాలన్నారు. ఫామ్-6 సంబంధ పెండింగ్‌లను ఆరు రోజుల్లో క్లియర్ చేయాలన్నారు. నగరంలోని ఆయా పోలింగ్‌బూత్‌ల (భౌతిక) వాస్తవ పరిస్థితుల సమాచారాన్ని తెలియజేయాలని ఆ సమాచారాన్ని ఎన్నికల కమిషన్‌కు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఎక్కువ ఓటర్లుగా నమోదయ్యే ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించుకొని అభ్యర్థులతో నిర్ధారణ చేయాలన్నారు. సమావేశంలో ఖిలావరంగల్ తహసీల్దార్ ఫణికుమార్, నాయబ్ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

ఈనెల 17న మంత్రి కేటీఆర్ నగర పర్యటన సందర్భంగా గురువారం బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల ఏర్పాట్లను పరిశీలించారు. ఎంజీఎం జంక్షన్, గోపాలస్వామి టెంపుల్ ఏరియా, దేశాయిపేటలోని జర్నలిస్ట్ కాలనీ, మండి బజార్, వరంగల్ చౌరస్తా, పోస్ట్ ఆఫీస్ జంక్షన్, వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్, ఉర్సు రంగలీలా మైదానం, బండ్, సీవరేజీ, ఉర్సు దర్గా ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, సిటీ ప్లానర్ వెంకన్న, సీఎంహెచ్‌ఓ రాజేశ్, సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఈఈ సంజయ్‌కుమార్, ఎంహెచ్‌ఓ జ్ఞానేశ్వర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌గా 'ఉర్సు గుట్ట'

ఎట్టకేలకు స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో కదలిక
- రూ.14.50 కోట్లతో చెరువు సుందరీకరణ
- సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, సైన్స్‌పార్కు నిర్మాణం
- వినోదం, ఆటలు, ఫుడ్ స్పాట్‌కు సకల ఏర్పాట్లు
- మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా రేపు పనులు ప్రారంభం



సాక్షి, వరంగల్ : నగర వాసులతోపాటు పర్యాటకులను ఆకర్షించేలా సకల హంగులతో ఉర్సు గుట్ట చెరువు ప్రాంగణంలో ట్యాంక్‌బండ్ నిర్మించాలన్న ప్రతిపాదనలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. నాలుగేళ్ల క్రితమే స్మార్ట్ సిటీలో భాగంగా 'షోర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఉర్సు గుట్ట లేక్' ఆలోచన చేసినా.. కొన్ని కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చిన పనులు ఈసారి పట్టాలెక్కుతున్నాయి. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ఆధ్వర్యంలో రూ.14.50 కోట్లతో ఈ గుట్ట సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. శనివారం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పనులు ప్రారంభం కానుండడంతో నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

100 ఎకరాల్లో ఉర్సు చెరువు..

- ఇప్పటికే భద్రకాళి బండ్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంతో పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఏటా దసరా ఉత్సవాలు జరిగే ఉర్సు గుట్ట చెరువును హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ మాదిరిగా సుందరీకరణ చేయనున్నారు. అయితే ఉర్సుగుట్ట చెరువు దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. చెరువుకు 750 మీటర్ల పొడవున్న 6 మీటర్ల వెడల్పుతో సైక్లింగ్ ట్రాక్, 1700 మీటర్ల పొడవున్న వైపు మూడు మీటర్ల వెడల్పుతో వాకింగ్ ట్రాక్ నిర్మాణంతోపాటు పర్యాటకులు కూర్చునేందుకు సీటింగ్ ఏర్పాటు చేయనున్నారు.
- నగరవాసుల కోసం ఉర్సు గుట్ట పక్కనే ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయనున్నారు. అక్కడే ఉన్న మైదానంలో పిల్లలు క్రికెట్ ఆడుకునేలా, పెద్దలు వాలీబాల్ ఆడుకునేందుకు సౌకర్యాలు కల్పించనున్నారు. గ్రీనరీపై దృష్టి సారించనున్నారు. రాత్రి వేళ కళ్లు మిరుమిట్లు గొలిపేలా లైట్లు అమర్చనున్నారు.



ఉర్సు చెరువు బండ్ రోడ్డు

- ప్రస్తుతం బతుకమ్మ, వినాయక విగ్రహాల నిమజ్జన పాయింట్లుగా ఉన్న ప్రాంతంలో కెఫెటేరియా నిర్మించనున్నారు. దిమ్మలపై టెంట్ స్ట్రక్చర్‌తో ఏర్పాటు చేసే కుర్చీల్లో కూర్చొని ఇష్టమైన ఆహారాన్ని తింటూ సరస్సులోని అలలను చూస్తూ సరదాగా గడపవచ్చు.
- మూడు నుంచి పదేళ్లలోపు పిల్లలకు సైన్స్‌పై విజ్ఞానం పెంపొందించేందుకు సైన్స్ పార్కు ఏర్పాటు చేయనున్నారు. అనేక మంది పాఠశాలల విద్యార్థులు ఇక్కడకు రావడం వల్ల మరింత పర్యాటక శోభను సంతరించుకోనుంది. బోటింగ్ సౌకర్యం కూడా ఉండనుంది.

ఆన్‌లైన్ మోసం..

- రూ.2.50 లక్షలు నష్టపోయిన బాధితుడు
- మరో పది మంది కూడా ..
- రూ. 6 లక్షల వరకు నష్టపోయినట్లు సమాచారం




మహబూబాబాద్ రూరల్ : సైబర్ నేరాల నియంత్రణకు ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు రూపొందించినా కేటుగాళ్లు మారడం లేదు. వివిధ మార్గాల్లో మోసాలను కొనసాగిస్తూనే ఉన్నారు. బ్యాంకు ఖాతా అప్‌డేట్ చేసుకోమనో.. ఏటీఎం పిన్ నంబర్ మార్చాలి.. ఫోన్‌కు వచ్చే ఓటీపీ చెప్పమనో అమాయకులను వివిధ రూపాల్లో దోచుకుంటూనే ఉన్నారు. ఫలితంగా రోజూ ఏదో చోట పలువురు సైబర్ మోసాల బారిన పడుతున్నారు. తాజాగా మహబూబాబాద్ మండలంలోని కొమ్ముగూడెం తండా గ్రామానికి చెందిన లావుడ్య మనోహర్ ఆన్‌లైన్ మోసంలో చిక్కుకుని రూ.2.50 లక్షలు నష్టపోయాడు. మనోహర్ ఆన్‌లైన్‌లో చైనా యాప్ ద్వారా వివిధ వస్తువులు కొనుగోళ్లు చేయడంతోపాటు పెట్టుబడి కూడా పెట్టాడు. అవతలి వ్యక్తులు పలుమార్లు ఇతడికి మేలు చేసి చూపించారు. కొంత పెట్టుబడి పెట్టగా కమీషన్ రూపంలో మరికొంత మొత్తాన్ని ఆన్‌లైన్ ఖాతాదారుడికి చెల్లించారు. దీంతో మనోహర్ కమీషన్ మరింత వస్తుందని నమ్మి అధిక మొత్తంలో లావాదేవీలు జరుపగా రూ. 2.50 లక్షల వరకు నష్టపోయాడు. దీనిపై సైబర్‌క్రైం వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. అదే విధంగా కొమ్ముగూడెంకు చెందిన మరో పది మంది కూడా చైనా యాప్‌లో పెట్టుబడి పెట్టి కనీసం వస్తువు కూడా పొందకుండానే రూ. 6 లక్షల వరకు నష్టపోయి మోసపోయినట్లు తెలిసింది.

అన్నదాతలు..అప్రమత్తం

- నకిలీ విత్తనాలను గుర్తించకపోతే నష్టం
- దిగుబడిలో విత్తన నాణ్యత కీలకం
- డూప్లికేట్ సీడ్స్‌ను ఇలా గుర్తించాలి : శాస్త్రవేత్తలు





కరీమాబాద్ : అన్నదాతలు కోటి ఆశలతో ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో నకిలీ విత్తనాల బెడద వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పత్తి, మిరప, వరి, మొక్కజొన్న విత్తనాలలో ఏది నాణ్యమైందో.. ఏది నకిలీదో తెలియని స్థితిలో గందరగోళానికి గురవుతున్నారు. ఎక్కువ దిగుబడి వస్తుందంటూ దళారులు మాయమాటలతో ఊరు పేరు లేని విత్తనాలను అంటగడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. విత్తన ఎంపిక, నకిలీని గుర్తించడంలో అవగాహన ఉండాలని పేర్కొంటున్నారు.

నకిలీ విత్తనం అంటే..

విత్తన ధ్రువీకరణ సంస్థ నుంచి అనుమతి లేని గింజలను నకిలీ విత్తనాలుగా పరిగణిస్తారు. అంతే కాకుండా ఎలాంటి అడ్రస్ లేకుండా అక్రమంగా అమ్ముతున్న విత్తనాలను కూడా నకిలీగానే భావించాలి. వాణిజ్య పరీక్షల నుంచి చోరీకి గురైన విత్తనాలు, నకిలీ ప్యాకింగ్ చేసి అమ్ముతున్న విత్తనాలు, లైసెన్స్ లేకుండా అమ్ముతున్న డీలర్ల వద్ద లభించే విత్తనాలను కూడా నకిలీగానే గుర్తించాలి.

నకిలీ విత్తనాలను గుర్తించడం రెండు రకాలు..

నకిలీ విత్తనాలను రెండు రకాలుగా గుర్తించొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందులో ఒకటి పంట వేయక ముందు, రెండోది పంట వేసిన తర్వాత. అయితే పంట వేయక ముందే నకిలీదని గుర్తిస్తే రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండొచ్చు. పంట వేసిన తర్వాత గుర్తించినా లాభం ఉండదు. అందుకే రైతులు విత్తనాలు ధ్రువీకరించుకున్న తర్వాతనే నాటుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

1. విత్తనం నాటక ముందు..

- ప్రభుత్వ లైసెన్స్ పొందిన డీలర్ల దగ్గరే విత్తనాలు కొనాలి.
- విత్తన ప్యాకెట్లపై కంపెనీ హోలోగ్రాం సరి చూసుకోవాలి.
- తక్కువ ధరకు వస్తున్నాయని మూట కట్టిన విత్తనాలను కొనొద్దు.
- రైతులు రశీదు(బిల్లు)లు తప్పకుండా తీసుకోవాలి.
- విత్తన బ్యాగు వెనక పచ్చరంగులో ఉంచిన స్టిక్కర్ లేదా ట్యాగ్ ఉందో లేదో చూసుకోవాలి. ట్రూత్‌ఫుల్లీ విత్తనం అయితే 'పచ్చ రంగు' ధ్రువీకరణ పొందిన విత్తనమైతే 'నీలి రంగు' ట్యాగ్‌లుంటాయి.
- విత్తన ట్యాగ్‌లపై కంపెనీ లైసెన్స్ నంబర్, లాట్ నంబర్, క్యూఆర్ కోడ్‌తోపాటు వ్యాలిడిటీ డేట్ కూడా చూసుకోవాలి.

2. పంట కాలంలో అయితే..

- విత్తనాలు సరిగా మొలకెత్తకపోవడం
- మొలకెత్తిన మొక్కలు ఎత్తుగా పెరగకపోవడం
- పూర్తిస్థాయిలో పూత రాకపోవడం
- వచ్చిన పూత రాలిపోవడం, కాయలుగా మారకపోవడం వంటి లక్షణాలు పంట సమయంలో గుర్తించొచ్చు.

దిగుబడిలో విత్తన ఎంపికే కీలకం..



పంటల దిగుబడి విషయంలో విత్తనాల ఎంపిక కీలకం. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో లైసెన్స్, క్యూఆర్ కోడ్, ప్యాకింగ్ డేట్, వ్యాలిడిటీ డేట్ చూసుకోవాలి. తక్కువ ధరకు వస్తున్నాయని విడి విత్తనాలు కొనొద్దు. రంగుల కవర్లలో ప్యాక్ చేసి అమ్ముతున్న విత్తనాల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

డాక్టర్ రాజు, సమగ్ర సస్యరక్షణ శాస్త్రవేత్త

బ్రిడ్జి రక్షణ గోడను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు



మహమ్మద్ ఇప్సాల్ అహ్మద్ మృతదేహం

రఘునాథపల్లి : కారు అతివేగం ఒకరి ప్రాణాన్ని బలిగొనగా, మరో ముగ్గురిని గాయాలకు గురిచేసింది. ఈ ఘటన హన్మకొండ, హైదరాబాద్ జాతీయ రహదారిపై నిడిగొండ బ్రిడ్జి వద్ద గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కేశిరెడ్డి యోగేశ్వర్‌రెడ్డి తన కారులో హైదరాబాద్‌లో నలుగురు ప్రయాణికులకు ఎక్కించుకొని హన్మకొండకు బయలుదేరాడు. ఈక్రమంలో నిడిగొండ బ్రిడ్జి వద్ద అతివేగంగా వచ్చి అదుపు తప్పి రక్షణ గోడకు ఢీకొన్నాడు. దీంతో డ్రైవర్ సీటు వెనక కూర్చున్న హన్మకొండకు చెందిన మహమ్మద్ ఇప్సాల్ అహ్మద్ (43) అక్కడికక్కడే మృతి చెందగా మిగతా ముగ్గురు తాటికొండ నవీన్, కురిమిల్ల అనూష, ఝొర్ర అవినాశ్‌కు గాయాలయ్యాయి. డ్రైవర్ యోగేశ్వర్ రెడ్డి ప్రమాదం నుంచి బయటపడి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను 108లో జనగామ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అతివేగం కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి మహమ్మద్ ఖాజా అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చాగర్ల రఘుపతి తెలిపారు.

పరువు తీస్తున్నారని.. వ్యక్తి ఆత్మహత్య



రాములు(ఫైల్)

ఐనవోలు: కుటుంబ సభ్యులే తన పరువు తీస్తున్నారని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి.. ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని నాగపురంలో జరిగింది. ఎస్సై వెంకన్న కథనం ప్రకారం ఐనవోలు గ్రామానికి చెందిన ఆవునూరి రాములు(52) కుల వృత్తి కుమ్మరి పనితోపాటు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన రాములు.. నిత్యం తన భార్య, కుమారులతో గొడవ పడుతున్నాడు. కుమారులకు పెండ్లిళ్లు అయినప్పటికీ ఉమ్మడిగానే ఉంటున్నారు. తరచూ కోడళ్ల ఎదుట తన పరువు తీస్తున్నారని మనస్తాపానికి గురైన రాములు గురువారం నాగపురం వద్ద ఉన్న వ్యవసాయ క్షేత్రంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటువైపు వెళ్తున్న ఒంటిమామిడిపల్లికి చెందిన వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వర్ధన్నపేటకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు నరేశ్, సురేశ్ ఉన్నారు. భార్య హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏడునూతులలో వివాహిత ..



శోభారాణి(ఫైల్)

కొడకండ్ల : ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని ఏడునూతులలో జరిగింది. గ్రామానికి చెందిన బోల్లోజు శోభారాణి(32), వెంకటాచారి దంపతులు. వీరు బుధవారం సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం కొమ్మాల గ్రామంలో జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలకు హాజరై వచ్చారు. ఈ క్రమంలో గురువారం ఉదయం దంపతుల మధ్య గొడవ జరిగి భర్త బయటకు వెళ్లగా శోభారాణి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. శోభారాణి మృతికి గల కారణాలు తెలియలేదు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వెంకటాచారి కులవృత్తి, (వడ్రంగి) శోభారాణి టైలర్ పని చేసుకొంటూ కొడుకు, కుమార్తెతో కలసి జీవనం కొనసాగిస్తున్నారు.

కొడిశలకుంటలో మహిళ..

ములుగు రూరల్: కుటుంబ కలహాలతో వివాహిత బలవన్మరణం చెందారు. ఈ ఘటన మండలంలోని కొడిశలకుటంలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొడిశల కుంటకు చెందిన పోరిక సంతోష్, కవిత (28) దంపతులు. వీరికి కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేశారు. అయినప్పటికీ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో కవిత గురువారం ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆత్మహత్య కేసులో ఐదుగురి అరెస్టు

కేసముద్రం: మండలంలోని ధర్మారం తండా జీపీ శివారు వెంక్యాతండాకు చెందిన బానోతు అశోక్.. తన భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మే 30న మృతి చెందాడు. ఈ ఘటనలో అత్తింటికి చెందిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ మండలం ముత్యాలమ్మతండాకు చెందిన మృతుడి మామ వాంకుడోతు ఆనంద్, అత్త సత్రి, భార్య బేబి, మరిపెడ మండలం కొత్తతండాకు చెందిన తోటిఅల్లుడు భుక్యా నరేశ్, వదిన రజితను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి



భాగ్యమ్మ(ఫైల్)

డోర్నకల్ : వడదెబ్బకు గురైన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలంలోని ఉయ్యాలవాడకు చెందిన పగిడిపాల భాగ్యమ్మ(65) ఇటీవల ఎండకు అస్వస్థతకు గురై చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతి చెందింది.

కూతురికి మానసిక వ్యాధి..

- తమను రక్షించాలని తల్లి పోలీసులకు ఫిర్యాదు
- వైద్య పరీక్షల నిమిత్తం ఎంజీఎంకు తరలింపు

హసన్‌పర్తి: కూతురు మానసిక ప్రవర్తనతో ఇబ్బందులు పడుతున్నామని, ఆమె నుంచి తమను రక్షించాలని కోరుతూ తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. హసన్‌పర్తి మండలం సీతంపేటకు చెందిన క్రిష్టాది లక్ష్మికి ఇద్దరు కూతురులు ఉన్నారు. ఇందులో పెద్ద కూతురు రాజేశ్వరి(42) 28 ఏళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. రోజురోజుకూ ఆమె ప్రవర్తనలో మార్పు వస్తోంది. ఈ కారణంగా కుటుంబసభ్యులతో పాటు చుట్టుపక్కల వారు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో తల్లిపై కూడా భౌతిక దాడులకు పాల్పడుతోంది.అలాగే, రాత్రి వేళల్లో గది తలుపులు వేసుకుని భయంకరంగా అరుస్తూ ఇబ్బందులకు గురి చేస్తోంది. దీనిపై స్పందించి తమ కూతురు నుంచి కాపాడాలని తల్లి కోరగా ఆమె ఫిర్యాదు మేరకు రాజేశ్వరిని వైద్య పరీక్షల నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

పాద రక్షలు లేకుండా..దీక్ష



పాద రక్షలు లేకుండా నడుస్తున్న గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్

కొత్తగూడ: : కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని ఆకాంక్షిస్తూ మంత్రి సత్యవతిరాథోడ్ ఆరునెలలుగా కాళ్లకు చెప్పులు వేసుకోకుండా కఠోర దీక్ష చేపడుతున్నారు. ఇందులో భాగంగా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మొండ్రాయిగూడెం గ్రామంలో జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో మండుటెండలో గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖామాత్యులు సత్యవతి రాథోడ్ నడిచారు. ఇప్పటికే ఆమె కాళ్లకు బొబ్బలు వచ్చాయి. అయినా దీక్షను విరమించకుండా పాద రక్షలు లేకుండానే నడుస్తున్నారు.

శభాష్.. వెంకటయ్య



సీపీఆర్ చేసిన అనంతరం శివరామయ్యతో హోంగార్డు వెంకటయ్య

రామన్నపేట: ట్రాఫిక్ హోంగార్డు..సీపీఆర్ చేసి ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడాడు. ఈ ఘటన గురువారం వరంగల్ నగరంలో చోటుచేసుకుంది. వరంగల్ హెడ్ ఆఫీసు సమీపంలో కడప జిల్లా బద్వేల్‌కు చెందిన పల్లెపు శివ రామయ్య అనే వ్యక్తికి ఒక్కసారి గుండె పోటు రావడంతో రోడ్డుపై పడిపోయాడు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ హోంగార్డు వెంకటయ్య వెంటనే అతని వద్దకు చేరుకొని సీపీఆర్ చేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. వెంటనే అతడిని మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడిన హోంగార్డు వెంకటయ్యను అధికారులు అభినందించారు.

దాడి ఘటనలో ఆరుగురిపై కేసు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరాకాలనీకి చెందిన పత్తి శ్రీకాంత్‌పై దాడి చేసి గాయపర్చిన ఘటనలో అతడి భార్య చందన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ ఎస్సై వి.దీపికా రెడి గురువారం తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో పత్తి శ్రీకాంత్‌పై వారి బంధువులు పత్తి మాధవి, శ్రీధర్, శ్రీహరి, శ్రీరాం, ప్రమీల, శివాని దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. కాగా, బంధువుల నుంచి తమకు ప్రాణభయం ఉందని చందన టౌన్ పోలీస్ స్టేషనలో ఫిర్యాదు చేసింది.

రాష్ట్రంలో ప్రగతి పరుగులు



కడవెండిలో సభలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి. చిత్రంలో కలెక్టర్ శివలింగయ్య, తదితరులు

'పల్లెప్రగతి'తో మారిన గ్రామాల స్వరూపం

- ఉద్యమవీరుల స్ఫూర్తితో కడవెండి రుణం తీర్చుకుంటా
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- రూ.4.41కోట్ల పంట నష్టపరిహారం చెక్కుల పంపిణీ

దేవరుప్పుల : బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రగతి పరుగులు తీస్తోందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం కడవెండిలో నిర్వహించిన 'పల్లె ప్రగతి దినోత్సవ' కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన 1851 జీపీలు 'పల్లెప్రగతి' పనులతో సమగ్రాభివృద్ధి చెందాయని, తెలంగాణ ఓడీఎఫ్ రాష్ట్రంగా ఘనత సాధించిందని చెప్పారు. తాగు, సాగు నీటి కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో మహిళలకు వెసులుబాటు, భూమికి ధర పెరిగి అన్నదాతల ఆత్మగౌరవం పెరిగిందన్నారు. పొన్నాల లక్ష్మయ్య మంత్రిగా ఉన్న సమయంలో ఈ ప్రాంత అభివృద్ధిని విస్మరిస్తే తాను సమగ్రాభివృద్ధికి కృషి చేసినట్లు ఎర్రబెల్లి పేర్కొన్నారు. ఉద్యమాల గడ్డ కడవెండి రుణం తీర్చుకోవడానికి 'పల్లెప్రగతి' దినోత్సవం కార్యక్రమాన్ని ఇక్కడి నుంచి ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. చైతన్యవంతమైన ప్రజలు విపత్కర పరిస్థితుల్లోనూ మూడు దఫాలుగా ఆశీర్వదించడంతో నేడు మంత్రిగా రాణించగలుగుతున్నానని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఐఎస్‌ఓ సర్టిఫికెట్లకు ఎంపికైన జీపీల సర్పంచ్‌లు పోతిరెడ్డి బెత్లీనా(కడవెండి), యాకంతారరావు(పాలకుర్తి) తోపాటు కొడవటూరు, చిన్నపెండ్యాల జీపీలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అలాగే జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం కింద రూ.4కోట్ల 40 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు కిట్లు అందజేశారు. డీపీఓ రంగాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీఆర్‌డీఓ రామిరెడ్డి, డీఈఓ రాము, ఎంపీపీ బస్వ సావిత్రి, వైస్‌ఎంపీపీ విజయ్, ఎంపీటీసీ కవిత, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ సురేష్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రమేష్, ఉపసర్పంచ్ నగేష్, విద్యాసాగర్, వీరాచారి, సోమయ్య, దయాకర్, బస్వ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ర్యాలీ అనంతరం నూతన జీపీ భవనం, పాలసేకరణ కేంద్రాన్ని, పాఠశాలలో డైనింగ్ హాల్, డిజిటల్ క్లాస్ గదిని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు.

'పెరుమాండ్ల'కు పెంపు లేనట్లే..!

ఈ నెల 21తో ముగియనున్న సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ పదవి కాలం

- ఖాళీ చైర్మన్ స్థానానికి ఇంటర్వ్యూ
- ఇద్దరు రిటైర్డ్ ఇంజనీర్లు హాజరు
- ఆ ఇద్దరిలో ఎవరిని వరించేనో..



సీజీఆర్‌ఎఫ్ కార్యాలయం

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్‌-1) వరంగల్ చైర్మన్ పెరుమాండ్ల సత్యనారాయణ పదవీకాలం పెంపు లేనట్లేనని తేలిపోయింది. ఈ నెల 21తో మూడేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకోనున్న ఆయన.. మరికొంత కాలం చైర్మన్‌గా కొనసాగేందుకు ప్రయత్నాలు చేశారు. తనకున్న పరిచయాల ద్వారా పదవి కాలపరిమితి పొడిగింపునకు తీవ్రంగా ప్రయత్నించారు. కానీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు. కాగా, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి టీఎస్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో రెండు సీజీఆర్‌ఎఫ్‌లను ఏర్పాటు చేసింది. సీజీఆర్‌ఎఫ్‌-1 వరంగల్ కేంద్రంగా, సీజీఆర్‌ఎఫ్‌-2 నిర్మల్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. వరంగల్ కేంద్రంగా ఏర్పాటు చేసిన సీజీఆర్‌ఎఫ్‌-1 ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల పరిధిలో పని చేస్తుంది. నిర్మల్ కేంద్రంగా ఏర్పాటు చేసిన సీజీఆర్‌ఎఫ్‌-1 ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా పరిధిలో పని చేస్తుంది. టీఎస్ ఎన్పీడీసీఎల్ ద్వారా సేవలు అందడంలో ఆలస్యమైనా, సౌకర్యాలు కల్పించకపోయిన, విద్యుత్ సర్వీస్‌ల మంజూరు, ఆలస్యం వంటి సమస్యలను వినియోగదారులు సీజీఆర్‌ఎఫ్‌లో ఫిర్యాదు చేసి పరిష్కరించుకునేందుకు ఈ వేదికను ఏర్పాటు చేశారు.

మే 29న చైర్మన్ పదవికి ఇంటర్వ్యూ..

ప్రస్తుత వరంగల్ సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ పెరుమాండ్ల సత్యనారాయణ 2020 జూన్ 22న బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్ల కాల పరిమితితో టీఎస్ ఈఆర్‌సీ అప్పట్లో సత్యనారాయణను చైర్మన్‌గా నియమించింది. పదవీకాలం సమీపించడంతో మే 29న చైర్మన్ పదవికి ఇంటర్వ్యూ నిర్వహించడంతో సత్యనారాయణకు పొడిగింపు దారులు మూసుకుపోయాయి. దీంతో త్వరలో కొత్త చైర్మన్ రానున్నారు. ఈ నెల 29న ఇంధన శాఖ, టీఎస్ ఈఆర్‌సీ నిర్వహించిన ఇంటర్వ్యూకు ఇద్దరు రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్లు హాజరయ్యారు. వీరిలో ఒక్కరికి సీజీఆర్‌ఎఫ్ చైర్మన్‌గా అవకాశం దక్కనుంది. టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్‌గా పని చేసి రిటైర్డ్ అయిన ఇ.నారాయణ, కమర్షియల్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా పని చేసి రిటైర్డ్ వేణుగోపాలచారి ఇంటర్వ్యూకు హాజరయ్యారు. వీరిద్దరిలో ఒక్కరిని సీజీఆర్‌ఎఫ్ చైర్మన్‌గా నియమించే అవకాశముంది. ఈ నెల 21తో ప్రస్తుత చైర్మన్ సత్యనారాయణ పదవీ కాలం ముగియనుండడంతో ఈ లోపు నూతన చైర్మన్ నియామకానికి సంబంధించి ఉత్తర్వులు వెలువడే అవకాశముందని విద్యుత్ ఉద్యోగ వర్గాలు తెలిపాయి. కాగా, ఇంటర్వ్యూలు నిర్వహించిన వారిలో ఒక్కరిని చైర్మన్‌గా నియమిస్తుందా లేదా ప్రస్తుత చైర్మన్ పదవీకాలం పొడిగిస్తుందా అనే విషయంపై ఉత్తర్వులు వెలువడితేనే స్పష్టత వస్తుంది.

ఆర్టీసీ ఐటీఐలో ప్రవేశాలకు 19 చివరి తేదీ

ఐటీఐలో ట్రేడ్‌ల వివరాలు... (ఫీజు రూ.లలో)

ట్రేడ్	అర్హత	కాలవ్యవధి	సీట్లు	ఏదాదికి ఫీజు
డీజిల్ మెకానిక్	10వ తరగతి	1 సంవత్సరం	48	16,500
మోటారు మెకానిక్	10వ తరగతి	2 సంవత్సరాలు	24	16,500
వెల్డర్	10వ తరగతి	1 సంవత్సరం	20	16,500
పెయింటర్	10వ తరగతి	2 సంవత్సరాలు	40	16,5000

హన్మకొండ: వరంగల్ ములుగు రోడ్డులోని ప్రభుత్వరంగ సంస్థ టీఎస్ ఆర్టీసీ ఐటీఐలో ప్రవేశాలకు ఈ నెల 19 తుది గడువుగా నిర్ణయించారు. అనుభవజ్ఞులైన, సుశిక్షితులైన ఇన్‌స్ట్రక్టర్లతో అత్యుత్తమ విద్యా బోధన సాగుతోందని ప్రిన్సిపాల్ వంగాల మోహన్ రావు గురువారం తెలిపారు. సంస్థ డిపో గ్యారేజీలో అత్యాధునిక టెక్నాలజీ ఇంజిన్ (బీఎస్‌-6) వంటి బస్సులపై ఉత్తమ శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రొజెక్టర్ ద్వారా పాఠ్యాంశాల బోధన, కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నారు. ఇదే సంస్థలో అప్రెంటీస్ సౌకర్యం కల్పిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐటీఐ లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9849425319, 8008136611 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దత్తత గ్రామాల్లో పనులు పూర్తి చేయాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ గోపాల్ రావు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ గోపాల్ రావు

హన్మకొండ: విద్యుత్ అధికారుల దత్తత గ్రామాల్లో పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు ఆదేశించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీ డీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎస్‌ఈలు, డీఈలు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలు, డివిజన్‌లు, విభాగాల వారీగా ప్రతిని సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీఎస్ ఐపాస్, హెచ్‌టీ సర్వీస్‌ల మంజూరులో జాప్యం లేకుండా రిలీజ్ చేయాలన్నారు. కాలిన, పనిచేయని మీటర్లను మార్చాలన్నారు. రెండు సంవత్సరాలు పైబడిన వర్క్ ఆర్డర్లను పూర్తి చేయాలన్నారు. రూ.50,000 పైబడిన బకాయిని వసూలు చేయాలన్నారు. 33/11 కేవీ అంతరాయాలు తగ్గించి ఫీడర్లపై ఓవర్ లోడ్ భారం పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు లైన్ల నిర్వహణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్ రెడ్డి, వి.తిరుపతి రెడ్డి, డీఈ (ఐటీ) అనిల్ కుమార్, సీజీఎంలు, ఎస్‌ఈలు, డీఈలు పాల్గొన్నారు.